క్లుప్తంగా

బ్రిడ్జికి అడ్డుపడిన ఆకుల తొలగింపు



తొగర్చేడు బ్రిడ్జికి అడ్డుపడిని ఆకులను పొక్లయిన్‌తో తొలగిస్తున్న దృశ్యం

పాణ్యం: భారీ వర్షాలకు కుందూ నదిపై నుంచి గుర్రపుడెక్క ఆకుపెద్దఎత్తున కొట్టుకొచ్చి తొగర్చేడు బ్రిడ్జికి అడ్డుపడడంతో దిగువకు నీరు పోవడంలేదు. కుందూ నది కనబడనంతగా ఆకు పెరుకుపోయింది. దీంతో గ్రామస్తులు పొక్లయిన్‌తో గుర్రపుడెక్క ఆకు తొలగింపు చేపట్టారు. ఆకు తొగింపునకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శ్రమించారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇంకా గుర్రపుడెక్క ఆకు వస్తున్నట్లు గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

పేదలకు సంపూర్ణంగా సంక్షేమ ఫలాలు



ధ్రువీకరణ పత్రము అందిస్తున్న కార్పొరేటర్

కల్లూరు: అన్ని వర్గాల పేదలకు సంక్షేమ పథకాలు సంపూర్ణంగా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కార్పొరేటర్ మిద్దె చిట్టెమ్మ అన్నారు. ఆదివారం 31వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ప్రజలకు కుల, ఆదాయ, జనన తదితర ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సహకారంతో వార్డును మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు గోపాలకృష్ణ, క్రిష్టఫర్, నాయకులు తిరుపాలు, పెద్దన్న, భాస్కర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో అల్లర్లను నివారించాలి



కలెక్టరేట్ ఎదుట కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు(సెంట్రల్) : మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శాంతిని కోరుతూ శనివారం రాత్రి కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ఆ యూనియన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, వెంకటేష్, రామకృష్ణారెడ్డి, జయరాం రెడ్డి పాల్గొన్నారు.

రేపు న్యాయవాదుల నిరసన

కర్నూలు(లీగల్) : బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది ఆర్.ఆదిశేషు విట్టల్ దారుణ హత్య ఘటనకు నిరసనగా ఈనెల 31 సోమవారం జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు తమ విధులను బహిష్కరిస్తున్నారు. శనివారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు న్యాయవాదుల సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నాగభూషణం నాయుడు, ఎం.వి.చక్రపాణి తెలిపారు. న్యాయవాదిని హతమార్చిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణకు రాష్ట్రంలో ప్రత్యేక చట్టం రూపొందించి శాసనసభలో ప్రవేశపెట్టాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పి.రవిగువేరా, ఐఏఎల్ నాయకులు రవికాంత్ ప్రసాద్, పి.దస్తగిరి, రంగనాథ్ డిమాండ్ చేశారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత

వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న ఈ వలంటీర్ పేరు సుభాషిణి. చిందుకూరు గ్రామానికి చెందిన రామలక్ష్మమ్మ కాలికి గాయం కావడంతో నంద్యాల సమీపంలోని శాంతిరాం ఆసుపత్రిలో చేరింది. విషయం తెలుసుకున్న వలంటీర్ సొంత ఖర్చులతో అక్కడికి వెళ్లి చికిత్స పొందుతున్న ఆమెకు పింఛన్ సొమ్ము అందజేసింది. ఈ వలంటీర్ సేవాభావాన్ని గ్రామస్తులు అభినందించారు. ఇలా పలువురు వలంటీర్లు ప్రజలకు అవసరమైన సేవలను వారి చెంతకు వెళ్లి అందిస్తూ మన్ననలు పొందుతున్నారు.



శాంతిరాం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిందుకూరు అంత్రబోయిన రామలక్ష్మమ్మకు పింఛన్ సొమ్మును అందిస్తున్న వలంటీరు సుభాషిణి (ఫైల్)

సేవకు సలాం!

- ప్రజలకు అందుబాటులో వలంటీర్లు
- ప్రతినెలా 1వ తేదీ ఉదయాన్నే పింఛన్ పంపిణీ
- ప్రభుత్వ సంక్షేమపథకాలు ఇంటి వద్దకు చేరవేత
- వృద్ధులు, వితంతువులకు తప్పిన కష్టాలు
- వలంటీరు వ్యవస్థపై సర్వత్రా హర్షం



ఐరిస్ ద్వారా పింఛన్ సొమ్మును వృద్ధురాలు బాలేశ్వరమ్మకు అందిస్తున్న వలంటీరు శ్రీనివాసులు (ఫైల్)

గడివేముల: ఇంటి ముంగిటకే సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థ ప్రజల మన్ననలు పొందుతోంది. 2019 ఆగస్టు 15న ప్రారంభమైన ఈ వ్యవస్థలోని వలంటీర్లు సేవాభావంతో విధులు నిర్వహిస్తున్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సేవలను అందజేస్తున్నారు. మండలంలో 14 గ్రామ సచివాలయాల్లో 228 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్ సొమ్ము తీసుకునేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు కాసే పరిస్థితి ఉండేది. చేతికి పింఛన్ సొమ్ము అందేందుకు మూడు నుంచి ఐదు రోజులు పట్టేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెల ఒకటో తేదీ తెల్లవారక ముందే వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి పింఛన్ అందజేస్తున్నారు. దీంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుని చేరవేస్తున్నారు. అర్హులైన విద్యార్థులు సకాలంలో అమ్మ ఒడి, జగనన్నవసతి దీవెన, విద్యా దీవెన తదితర వాటికి దరఖాస్తు చేసుకునేలా చూస్తున్నారు. ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలను పార్టీలకు అతీతంగా గుర్తించి ప్రభుత్వానికి తెలియజేస్తున్నారు.

సేవ చేయడం సంతృప్తి నిస్తోంది



నా పరిధిలో ఉన్న కుటుంబాలకు కుటుంబసభ్యురాలిగా సేవలు అందించడం సంతోషంగా ఉంది. నేను ప్రతి నెల ఒకటో తేది తెల్లవారుజామునే గుడ్ మార్నింగ్ చెప్పి పింఛన్లు అందిస్తాను. ఇంటికి వచ్చి పింఛన్ ఇవ్వడం వల్ల వారి సంతోషానికి అవధులు ఉండవు. నా క్లస్టర్ పరిధిలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకం అందిస్తున్నాను. ఈ సేవలోనే మాకు ఎంతో సంతృప్తి కలుగుతోంది. ప్రభుత్వం మా సేవలను మెచ్చి ఏటా ప్రోత్సాహకాలు అందిస్తోంది.

–రమాదేవి, బూజునూరు గ్రామ వలంటీరు

ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నారు



గతంలో పింఛన్ తీసుకోవడానికి మా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లేదాన్ని. అధికారులు వచ్చే వరకు వేచి ఉండాలి. గంటల తరబడి పడిగాపులు కాయడం వల్ల నీరసంతో కళ్లు తిరిగి పడిపోయిన సంఘటనలు ఉన్నాయి. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత మా కష్టాలు తీరాయి. వలంటీరు ఉదయాన్నే ఇంటి వద్దకు వచ్చి పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. ఈ వ్యవస్థతో మాకు ఎంతో మేలు జరుగుతుంది.

–పెద్దమాబున్నీ, గడివేముల

దరఖాస్తు చేయగానే..



నేను గత ప్రభుత్వంలో ఎన్నో సార్లు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. మంజూరు కాలేదు. ప్రతి సారి తిరస్కరించడం జరిగింది. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పింఛన్ మంజూరైంది. వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి దరఖాస్తు చేయించారు. ఇప్పుడు నెలకు రూ. 2,750 పింఛన్ అందుతుంది. ఈ సొమ్ము కూడా వలంటర్ మా ఇంటి వద్దకు వచ్చి ఇవ్వడం ఆనందంగా ఉంది.

–జక్కుల ఎల్లమ్మ, వితంతు పింఛన్, గడిగరేవుల గ్రామం

ఆలయాభివృద్ధికి సహకారం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న మహాప్రాకారానికి పూర్తి స్థాయిలో సహకారం అందిచేందుకు నంద్యాల పట్టణం రామకృష్ణ కళాశాల చెర్మెన్ రామక్రిష్ణారెడ్డి ముందుకొచ్చారని ఈఓ రామక్రిష్ణ తెలిపారు. శనివారం చెర్మన్‌తో కలిసి నిర్మాణాలపై చర్చించగా ముందస్తుగా రూ.లక్షలు కాంట్రాక్టర్‌కు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, ప్రధాన అర్చకుడు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



సంతకాలు చేస్తున్న హమాలీలు

కల్లూరు: హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి ఈఎస్‌ఐ పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని హమాలీ కార్మికుల ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం కల్లూరు ఎస్టేట్ హమాలీ అడ్డాలో కార్మికులతో సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు సాయిబాబా, సుధాకరప్ప మాట్లాడుతూ హమాలీ సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవిందు, చింతకాయల రవి, మధు, రమేష్, రామాంజనేయులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతికుటుంబానికి సంక్షేమ పథకాలు

- కర్నూలు మండల అధ్యక్షురాలు ధర్మవరం వెంకటేశ్వరమ్మ



లబ్ధిదారురాలికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

కర్నూలు (న్యూటౌన్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతికుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయని, మళ్లీ జగనన్ననే సీఎంగా ఎన్నుకుంటారని కర్నూలు మండల అధ్యక్షురాలు ధర్మవరం వెంకటేశ్వరమ్మ స్పష్టం చేశారు. కర్నూలు మండలం ఆర్‌కే దుద్యాల, రేమట గ్రామాల్లో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాలకు ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో సాకారం చేశారని, ప్రజల వద్దకే పాలన సాగిస్తున్నారని గుర్తు చేశారు. పార్టీలు, కులమతాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. ప్రజల వద్దకే పాలన సాగించేందుకు మరోమారు జగనన్న ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఎంపీపీ కోరారు. ఆర్‌కే దుద్యాల గ్రామంలో లబ్ధిదారులకు 320, రేమట గ్రామంలో 996 ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మండల మాజీ ఉపాధ్యక్షుడు వాసు, సచివాలయ కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, సంపత్‌కుమార్, సునీల్, కర్నూలు ఎంపీడీఓ అజాం ఖాన్, ఈఓఆర్డీ నాగేశ్వర్‌రెడ్డి, పీఎస్‌లు హరి, లక్ష్మీనాథ్, సునంద తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సర్టిఫికెట్



వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తులు స్వీకరించారు. ఒక్క రోజులోనే కుల, ఆదాయ పత్రాలు అందజేయడం ఆనందంగా ఉంది. జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడింది. గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగి వాళ్లం. చాలా ఇబ్బందులు పడ్డాం. ఇలాంటి కార్యక్రమం ఇంత వరకు ఎవ్వరూ చేయలేదు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– పద్మమ్మ, ఆర్ కే దుద్యాల గ్రామం

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా ఇచ్చారు



జగనన్న సురక్ష కార్యక్రమంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందించారు. గతంలో ఎప్పుడూ... ఏ ప్రభుత్వం సర్టిఫికెట్లు ఉచితంగా ఇవ్వలేదు. ఏదైనా అత్యవసరమైతే సర్టిఫికెట్ల కోసం చాలా ఇబ్బంది పడ్డాం. అధికారులు అందుబాటులో లేకపోతే సాయంత్రం వరకు నిరీక్షించాం. ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు స్వగ్రామంలోనే అందజేయడం సంతోషకరం.

– ఎర్రమ్మ, స్థానికురాలు

మతోన్మాద దాడులపై పోరాడుదాం

కర్నూలు(రూరల్): మణిపూర్‌లో జరుగుతున్న మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య వాదులు ఏకమై పోరాడుదామని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అరుణమ్మ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని పెద్ద మార్కెట్ ఉర్దూగర్ ఫంక్షన్ హాల్‌లో కేవీపీఎస్, ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మణిపూర్ పరిణామాలపై చర్చ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణమ్మ మాట్లాడుతూ.... మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు ఓ పథకం ప్రకారం జరుగుతున్నాయన్నారు. శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహించి నిందితులకు వత్తాసు పలకడం నీతిమాలిన చర్య అన్నారు. ఆ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి సంఘాల నేతలను ఉగ్ర వాదులతో పోల్చి 40 మందిని కాల్చివేసిందన్నారు. మణిపూర్‌లో మహిళలపై, ప్రజలపై జరుగుతున్న దాడులు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న కుట్రలలో భాగం అని ఆరోపించారు. ఈ ఘటనకు ప్రధాన మంత్రి పూర్తి బాధ్యత వహిస్తూ పార్లమెంట్ సాక్షిగా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా ఈ నెల 31వ తేదీన జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు మహా ప్రదర్శన నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్ బాబు, ప్రముఖ ఆర్థిక వేత్త మన్సూర్ రెహమాన్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడె కైలాస్ నాయక్,న్యాయవాది జయరాజు, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, కొమ్ముపాలెం శ్రీనివాసులు, చంద్రప్ప, సుభాన్, రోషన్ అలీ, తేజుమతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం



కోడుమూరులో ఏటికి తరలి వెళ్తున్న పీర్ల దేవుళ్లు



సి.బెళగల్‌లో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



విచిత్ర వేషధారణలో కళాకారులు



పీర్లదేవుళ్ల ఎదుట సాహొసేన్ ఆడుతున్న యువకులు, భారీగా తరలివచ్చిన జనం



సి.బెళగల్‌లో సుంతానమ్మ దర్గాలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



నిమజ్జనానికి వెళ్తున్న గోరుకల్లు పెద్దస్వామి

కోడుమూరు రూరల్ : మొహర్రం వేడుకలు శనివారం భక్తిశ్రద్ధల మధ్య ముగిశాయి. సాయంత్రం పట్టణంలో కొలువుదీరిన పీరుదేవుళ్లు స్థానిక మునిమంద వద్దకు ఊరేగింపుగా చేర్చారు. ఊరేగింపును తలికించేందుకు వచ్చిన ప్రజలతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. అక్కడి నుంచి ఏటికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా యువకులు డప్పుచప్పుళ్లకు లయబద్ధంగా సాహొసేన్ ఆడారు. భారీగా తరలివచ్చిన ప్రజలు పీర్లస్వాములకు బుక్కపిండి ఇచ్చి ప్రత్యేక చదివింపులు చదివించారు. అలాగే మండలంలోని గ్రామాల్లో కూడా మొహర్రం ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసాయి.

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు గ్రామాల్లో శనివారం మొహర్రం వేడుకలు ముగిశాయి. ఆయా చావిళ్లలో కొలువైన పీర్లదేవుళ్లను కులమతాలకు అతీతంగా తరలివచ్చిన భక్తులు చదివింపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. మండల కేంద్రం సి.బెళగల్‌లోని సుంతానమ్మ దర్గాకు భారీగా ప్రజలు తరలిరావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. సాయంత్రం పీర్ల చావిళ్ల దగ్గర ఏర్పాటు చేసిన అలాయిగుంతలను పూడ్చి మరోమారు పీర్ల దేవుళ్లను ఊరేగిస్తూ సవారి నిర్వహించారు. అనంతరం పీర్లను ఏటికి తీసుకెళ్లారు. అంరంగవైభవంగా పీర్లదేవుళ్ల ఊరేగింపు సాగింది.

పాణ్యం: మొహర్రం వేడుకలు శనివారం ముగిశాయి. కులమతాలకు అతీతంగా భక్తులు పీర్లదేవుళ్లను దర్శించుకుని చదింపులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మండల కేంద్రమైన పాణ్యంలో పీర్ల నిమజ్జనం వైభవంగా జరిగింది. పీర్లస్వాముల ఊరేగింపును తిలకించేందుకు భక్తజనం పెద్దఎత్తున తరలివచ్చారు. తహల్దార్ కార్యాలం వద్ద నిర్వహించే వేడుకలను చూసేందుకు ప్రజలు భారీగా రావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. అదేవిధంగా గోరుకల్లు అత్యంత వైభవంగా పీర్ల నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ వేడుకలను తిలకేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు. పీర్లదేవుళ్ల ఊరేగింపులలో కళాకారుల చిత్రవిచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి.

కల్లూరు: మండలంలో మొహర్రం వేడుకలు ముగిశాయి. పుసులూరు, తడకనపల్లె, బస్తిపాడు, ఉలిందకొండ మొదలగు గ్రామాల్లో కొలువుదిరిన పీర్ల స్వాములు సాయంత్రం ఏటికి తరలివేళ్లారు. ఏటికి తరలివెళ్తున్న పీర్లదేవుళ్లను భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.



పాణ్యంలో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు



బస్తిపాడు గ్రామంలో ఏటికి వెళ్తున్న పీర్ల స్వాములు



కళకళలాడుతున్న జొన్నపంట

వరుణుడు వర్షించె.. పైరు మురిసె

కర్నూలు (న్యూటౌన్): వారం రోజులుగా కురుస్తున్న వానలతో పంటలు కళకళలాడుతున్నాయి. వరుణుడిపై ఆధారపడి మండలంలో నెల రోజుల కిందట రైతులు వరి, బెండ, సజ్జ, వేరుశనగ, పత్తి, కొర్ర, కంది, పొద్దుతిరుగుడు తదితర పంటలు సాగు చేశారు. అయితే, నాటి నుంచి సరైన వానలు పడకపోవడంతో పంటలు వాడుముఖం పట్టాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వరుణుడు కరుణించి వర్షించడంతో పంటలకు ఊపిరిపోసినట్టైంది. అలాగే మునగాలపాడు, నిడ్జూరు, జి శింగవరం, ఎదురూరు, ఉల్చాల, ఆర్ కొంతలపాడు, ఆర్‌కె దుద్యాల, తులశాపురం, రేమట, సుంకేసుల గ్రామాల్లో ఖరీఫ్ పనులు ముమ్మరమయ్యాయి. రైతులు నల్ల నేలల్లో వరిసాగుకు సిద్ధమవుతున్నారు.



వరి పంట సాగుకు సిద్ధమైన నారు



వర్షాధారం కింద సాగు చేసిన బెండకాయ పంట

అనుమతిలేకుండా..

- డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే రహదారులపైకి
- 30 శాతం కుర్రకారుది ఇదే తీరు
- ఆటోవాలాల్లో 40 శాతం మంది
- అధికారుల తనిఖీల్లో వెల్లడి

కర్నూలు: అతివేగంగా బైకులపై దూసుకెళ్లే యువకులు... పాదచారులపై దూసుకొచ్చే కార్లు... ఎర్ర లైటు పడినా లెక్క చేయకుండా వెళ్లే ఆటోవాలాలు... కర్నూలు నగరంలోని రహదారులపై ఇవి నిత్యం కనిపించే దృశ్యాలే. అయితే, ఇలా వాహనాలు నడిపేవారిలో చాలా మందికి డ్రైవింగ్ లైసెన్స్ లేవనే చేదునిజం పోలీసులు గత కొద్దిరోజులు నిర్వహిస్తున్న ప్రత్యేక తనిఖీల్లో వెలుగుచూసింది.

అర్ధరాత్రి దాటాక షికార్లు...

కర్నూలు నగరంలో వాహనాలు నడుపుతున్న యువకులు, విద్యార్థుల్లో 30 శాతం మందికి పైగా డ్రైవింగ్ లైసెన్స్ లేదు. తల్లిదండ్రుల వాహనాలు, స్నేహితుల స్పోర్ట్స్ బైక్‌లను వీరు బయటకు తీసుకువచ్చి రహదారులపై దూసుకెళ్తున్నారు. పాదచారులు, ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. వారాంతాల్లో అర్ధరాత్రి వేళ నగర శివారులోని రింగ్ రోడ్డుపై (జగన్నాథ గట్టు) రేసులు నిర్వహిస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారికి గతంలో ఫిర్యాదులు కూడా అందాయి. పోలీసులు గట్టిగా నిఘా ఉంచడంతో ఆ జోరు తగ్గినప్పటికీ లైసెన్స్ లేకుండా వాహనాలు తోలుతున్న వారి సంఖ్య తగ్గడం లేదు.

ఆరు మాసాల వ్యవధిలో 3,600 మందిపై కేసులు...

నిబంధనల ఉల్లంఘనులపై ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధిస్తున్నప్పటికీ వాహనదారుల్లో మార్పు కనిపించడం లేదు. ఒక్క కర్నూలు నగరంలోనే ఆరు మాసాల వ్యవధిలో 3,600 మంది యువకులు, 350 మంది మైనర్లు లైసెన్స్ లేకుండా పోలీసులకు పట్టుబడ్డారంటే వాటి తీవ్రతకు అద్దం పడుతోంది. పట్టుబడిన మైనర్లలో మార్పు తీసుకొచ్చేందుకు పోలీసులు వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

నడపటానికి అర్హత లేదు...

ఆటోలు నడుపుతున్న వారిలో ప్రతి పదిమందిలో నలుగురికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండటం లేదని తనిఖీల్లో పోలీసులు గుర్తించారు. ఆర్థిక ఇబ్బందులు, పేదరికం కారణంగా ఇల్లు గడిచేందుకు వేరే ఆధారంగా లేక కొందరు డ్రైవింగ్‌ను వృత్తిగా ఎంచుకుంటున్నారు. రవాణా శాఖ నిబంధనల మేరకు ట్రాన్స్‌పోర్ట్ లైసెన్స్ ఉండాలి. దీనినే డ్రైవర్ల పరిభాషలో 'బ్యాడ్జి'గా వ్యవహరిస్తారు. ఇందుకు కనీసం 8వ తరగతి చదివి ఉండాలి. 5వ తరగతితో ఆపేయడం, మరికొందరు నిరక్షరాసులవడంతో లైసెన్స్‌లు తీసుకోవడం లేదు. ఇలాంటి వారిలో చాలా మంది రాత్రివేళల్లో ఆటోలు నడుపుతున్నారు. పోలీసులు తనిఖీ చేసినప్పుడు లైసెన్స్ ఇంట్లో మరిచిపోయామని, అవసరమైతే జరిమానా కడతామని చెబుతున్నారు. బ్యాడ్జి లేకున్నా సాధారణ లైసెన్స్ తీసుకోవాలనే నిబంధనలు ఉన్నప్పటికీ తీసుకునే ప్రయత్నం చేయడం లేదు. లైసెన్స్ లేని వారిలో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి నగరంలో అద్దె ఆటోలు నడుపుతున్నట్లు తనిఖీల్లో గుర్తించామని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. అయితే ఆటోడ్రైవర్లలో అర్హులైన వారికి చదువుకోలేని వారిని గుర్తించి సాధారణ లైసెన్స్ ఇప్పించేందుకు పోలీసు, రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆటో యూనియన్ల ప్రతినిధులు కొన్నేళ్లుగా కోరుతున్నారు. అనుకోకుండా ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు ఇన్సూరెన్స్ సొమ్ము వచ్చేలా అధికారులు నిర్ణయం తీసుకోవాలని యూనియన్ల ప్రతినిధులు కోరుతున్నారు.





లైసెన్స్‌ను తనిఖీ చేస్తున్న పోలీస్

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం నేరం



లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం చట్టరీత్యా నేరం. ట్రాఫిక్ నిబంధనలపై కళాశాలల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి అనుకోకుండా ప్రమాదానికి గురైతే విద్యార్థులు కేసుల్లో ఇరుక్కుని ఉద్యోగార్హత కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాం. కొంతమంది ఇన్సూరెన్స్ లేని వాహనాలు కూడా నడుపుతున్నారు. ఇది మరింత ప్రమాదకరం.

– నాగభూషణం, ట్రాఫిక్ డీఎస్పీ